క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మోరంపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మత్తుల నేపథ్యంలో సోమవారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ ఆల్ బ్యాంకు కాలనీ, మోడల్ కాలనీ, వీఎల్ పురం, సత్యనారాయణపురం, పెద్ద వీధి, శ్రీ నగర్ కాలనీ, తిలక్ రోడ్, కోనేరు పేట, సాయి బృందావన్ కాలనీ, మోరంపూడి సెంటర్, మార్కెల్ నేషనల్ హైవే ప్రాంతం, హోతా లేఅవుట్, మోరంపూడి, గణేష్ నగర్, మోరంపూడి సెంటర్లలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నయనాల కృష్ణారావుకు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న కృష్ణారావు

ప్రకాశం నగర్: పూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, మూల్ నివాసీ సంఘ జాతీయ అధ్యక్షుడు నయనాల కృష్ణారావు బెంగళూరులోని భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ ద్వారా గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. యూనివర్సిటీ డీన్ కేఎస్ సింగ్ అధ్యక్షతన బెంగళూరులో జరిగిన సమావేశంలో హ్యూమన్ రైట్స్ కమిషన్ వైస్ ప్రెసిడెంట్ కొయిరాలా ముఖ్య అతిథిగా హాజరై డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ విషయాన్ని నయనాల కృష్ణారావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. కాగా.. కృష్ణారావును రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ, బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు కేకే సంజీవరావు, స్వర్ణాంధ్ర సేవాసంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు, బామ్ సెఫ్ కేంద్ర కమిటీ సభ్యురాలు డాక్టర్ పితాని కోమల, ఇన్నీసుపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ కోళ్లబాబు, మాజీ కార్పొరేటర్ మొకమాటి సత్యనారాయణ, కడియాల గోపాలకృష్ణ, మార్గాని చంటిబాబు అభినందించారు.

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

కడియం: దుళ్లలోని శ్రీభూసమేత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టినట్లు ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు, భక్త బృందం తెలిపింది. ఈ మేరకు వివరాలను ఆదివారం స్థానిక విలేకరులకు వివరించారు. ఫిబ్రవరి 18వ తేదీ ఉదయం గోవింద మాలధారణలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 19వ తేదీన శేషవాహన సేవ, 20న గరుడ వాహన సేవ, 21న సుదర్శన హోమం, సింహవాహన సేవ, 22న అన్నకూటోత్సవం, హనుమంత వాహనసేవ, 23న లక్ష్మీహోమం, హంస వాహన సేవ జరుగుతాయన్నారు. 24న చక్రస్నానం, రాత్రి శ్రీపుష్పయాగం ఉంటాయని వివరించారు. వాహన సేవతో పాటు స్వామివారి రథోత్సవం కూడా ఉంటుందన్నారు. 18 నుంచి 24వ తేదీ వరకూ తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని తెలిపారు.

అన్ని స్థానాలలో పోటీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రమణ

రాజమహేంద్రవరం సిటీ: రానున్న ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సోషలిస్టు కూటమి తరుపున 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తామని ప్రజా సోషలిస్టు కూటమి రాష్ట్ర కన్వీనర్ బీసీ రమణ అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో ఆదివారం రాజమహేంద్రవరం పార్లమెంట్ ప్రజా సోషలిస్టు కూటమి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజమండ్రి పార్లమెంట్ స్థానానికి ప్రజా సోషలిస్ట్ పార్టీ అభ్యర్థిగా షేక్ జానీని ప్రకటించారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి - కో కన్వీనర్ గోరింత అప్పల రాజు, షేక్ జానీ పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరించే వారికే ఓటు

కంబాలచెరువు: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, వారికే తమ ఓటు అని పలువురు ఉద్యోగ ఉపాధ్యాయ నాయకులు అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ కేవీటీ డిగ్రీ కళాశాలలో ఆదివారం 'ఓట్ ఫర్ ఓపీఎస్' సభ జరిగింది. పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానంపై రాజకీయ పార్టీలు తమ వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. మరో పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యూటీఎఫ్ 50 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని గుర్తు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.కాంతారావు, సీపీఐ నాయకుడు జ్యోతిరావు, ఆప్ నాయకుడు వై.శ్రీనివాసరావు, బీఎస్పీ నాయకుడు పట్నాల విజయ్ కుమార్ పాల్గొన్నారు.



కంబాల చెరువు పార్కు



ఆకట్టుకుంటున్న సెల్ఫీ పాయింట్

ఆదాయం అదిరింది

- కంబాలచెరువు పార్కుకు సందర్శకుల తాకిడి
- రెండు నెలల్లో రూ.70 లక్షల ఆదాయం

రాజమహేంద్రవరం సిటీ: నగర సుందరీకరణ నేపథ్యంలో కంబాల చెరువు పార్కును ఆధునాతనంగా తీర్చిదిద్దారు. దీంతో పార్కుకు వచ్చే సందర్శకుల సంఖ్యతో పాటు ఆదాయం కూడా పెరిగింది. ఆధునీకరణ అనంతరం అక్టోబరు 18వ తేదీన ప్రారంభమైన కంబాల చెరువు పార్కు రెండు నెలల్లో రూ.70 లక్షల ఆదాయాన్ని ఆర్జించింది. నగరంలో ఎక్కడా లేని విధంగా చేసిన ఏర్పాట్ల కారణంగా కంబాల చెరువు పార్కును సందర్శించేందుకు రోజూ వందల మంది సందర్శకులు తరలివస్తున్నారు. ఈ పార్కు నిర్వహణను కొద్ది రోజుల పాటు నగర పాలక సంస్థ నిర్వహించింది. అనంతరం ప్రైవేటు వ్యక్తులకు అద్దె ప్రాతిపాదికన ఇచ్చారు. సాధారణ సమయాల్లో ఒక తరహా ధర, పార్కులో ఏర్పాటు చేసిన వాటర్ మ్యూజికల్ ఫౌంటైన్ పనిచేసినప్పుడు ప్రత్యేక టిక్కెట్ ధర నిర్ణయించారు. అదే తరహాలో సమయాలను కేటాయించారు. పార్కులో పలు రకాల ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. స్కై సైకిల్, జిప్‌లైన్, 360 డిగ్రీ సైకిల్, హ్యూమన్ గైరో, పెడల్ బోటింగ్ తదితర వాటిని యువత, చిన్నారులకు కోసం ఏర్పాటు చేశారు.

పార్కు సమయాలు

రోజు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకూ పార్కు నిర్వహిస్తున్నారు. అయితే ఉదయం నుంచి సాయంత్రం 5.59 గంటల వరకూ పార్కులో ప్రవేశించే పెద్దలకు రూ.30, చిన్నారులకు రూ.20 వసూలు చేస్తున్నారు. అలాగే వాటర్ మ్యూజికల్ ఫౌంటైన్ పనిచేసే సమయం అంటే సాయంత్రం 6 నుంచి 9.30 గంటల వరకూ పెద్దలకు రూ.50, చిన్నారులకు రూ.30గా నిర్ణయించారు.

టికెట్ వసూలులో గందరగోళం

పార్కుకు వచ్చే సందర్శకులు టిక్కెట్ కొనుగోలు చేసే సమయంలో మోసపోతున్నారు. సాయంత్రం 6 నుంచి వసూలు చేయాల్సిన ధరను 5.19 గంటల నుంచే వసూలు చేస్తున్నారని త్రిష, సంధ్య ఆవేదన వ్యక్తం చేశారు. వీరిద్దరూ గత నెల 26వ తేదీ 5.19 గంటలకు పార్కుకు వెళ్లారు. వారి నుంచి రూ.30 చొప్పున ఇద్దరికీ రూ.60 వసూలు చేయాలి. కానీ రూ.వంద తీసుకున్నారు. టికెట్ ధర విషయంతో మోసపోయామని తెలుసుకుని అధికంగా వసూలు చేసిన రూ.40 తిరిగి చెల్లించాలని ఎంత కోరినా తిరిగి ఇవ్వటానికి టికెట్ అమ్మే వ్యక్తులు ఇష్టపడలేదు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లిన ప్రయోజనం లేకుండా పోయింది. దీనిపై నగర పాలక సంస్థ రెవెన్యూ అధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా ఇలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు చేపడతామన్నారు.



పార్కులో టిక్కెట్ ధరల వివరాలు



ఫోన్‌పే ద్వారా చెల్లించిన ప్రవేశ రుసుము

అక్కాచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా

- రూరల్ నియోజకవర్గంలో రూ.99.77 కోట్ల రుణమాఫీ
- వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో మంత్రి వేణు



మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి వేణు, చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ప్రజాసంకల్ప పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని నాలుగు విడతల్లో అమలు చేసి, వారికి ఆర్థిక భరోసా కల్పించారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. హుకుంపేట డీమార్ట్ పక్కన గల మైదానంలో ఆదివారం రాజమహేంద్రవరం రూరల్ మండలానికి సంబంధించి నాలుగో విడత ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి వేణు మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా జగన్ అనేక సంస్కరణలు చేపట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతలుగా 7,98,395 గ్రూపులోని 79 లక్షల మంది సభ్యులకు రూ. 25,570 కోట్లను అందించినట్టు తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో నాలుగు విడతలుగా ఆసరా పథకం కింద 2,635 స్వయం సహాయక సంఘాల గ్రూపులకు రూ.99.15 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. ఒక్క నాలుగో విడతలోనే రూరల్ మండలంలో రు.22.77 కోట్ల రుణమాఫీ చేశామన్నారు.

మాట నిలబెట్టుకున్న జగన్

మంత్రి వేణు మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో స్వయం సహాయ సంఘాల గ్రూపు సభ్యులకు పావలా వడ్డీ అందిస్తే, నేడు ముఖ్యమంత్రి జగనన్న ఆసరా పథకం ద్వారా పూర్తి రుణమాఫీ చేశారన్నారు. చంద్రబాబు రుణమాఫీ చేయకుండా మహిళలను మోసం చేశారని, సీఎం జగన్ మాత్రం ఇచ్చిన మాటను నిలబెట్టుకుని నాలుగు విడతల్లో రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాలలో రూ.2.53 లక్షల కోట్లను వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేయగా, ఒక బీసీ సంక్షేమానికే 1.90 లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారు. రాబోయే ఎన్నికలలో మహిళలందరూ సీఎం జగన్‌ను ఆశీర్వదించి, మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం మంత్రి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, పార్టీ నాయకుల చేతుల మీదుగా రుణమాఫీ నమూనా చెక్కును మహిళలకు అందించారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి మహిళాసంఘాల సభ్యులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, డీఆర్‌డీఏ-వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీఎస్ మూర్తి, మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఎన్ జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, వైఎస్సార్ సీపీ జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్, హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, పార్టీ నాయకులు సాధనాల శివ, పడాల వీరరాఘవరెడ్డి, చెరుకూరి సత్యనారాయణ, ఎంఎం అలీ, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ఏలేటి దేవీదుర్గ, సేనాపతి వాణి, కోశాధికారి షణ్ముఖ కుమారి పాల్గొన్నారు.

చిన్న వెంకన్నబాబు స్వామీజీకి సత్కారం



చిన్న వెంకన్నబాబును సత్కరిస్తున్న ప్రముఖులు

ప్రకాశం నగర్: ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాడాల శ్రీమహాలక్ష్మి సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు స్వామీజీని కృతజ్ఞతాపూర్వకంగా సత్కరించారు. స్థానిక ఏకేసీ కళాశాలలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి న్యాయమూర్తి బులుసు శివశంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో భాగంగా ఇటీవల రాజమహేంద్రవరంలో భారీ ప్రదర్శన, తర్వాత మూడు రోజుల పాటు గైట్ కళాశాలలో మహాసభలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ మహాసభలు విజయవంతంలో క్రియాశీలక పాత్ర పోషించిన చిన్న వెంకన్నబాబు స్వామీజీని నిర్వాహకులు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆడిటర్ భాస్కర రామ్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, సుమేధ వెంకటరాజు, మనగుడి- మన సేవ భారతీయ ఆధ్యాత్మిక సేవాసమితి ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతాల రమేష్ పాల్గొన్నారు.

మిద్దె, పెరటి తోటల పెంపకంపై సదస్సు



కార్యక్రమంలో పాల్గొన్న హర్కారా, సరోజా తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం బర్మా కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం సాయంత్రం సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ (సీటీజీ) గ్రూపు ఆధ్వర్యంలో మిద్దెతోట - పెరటి తోట పెంపకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రూపు ప్రధాన అడ్మిన్ శ్రీనివాస హర్కారా, సరోజా మాట్లాడుతూ సిటీ ఆఫ్ టెరస్ గార్డెన్స్ గ్రూపు ద్వారా వేల మందికి మిద్దె తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అందులో భాగంగా రాజమండ్రి గ్రూపు సమావేశం అడ్మిన్లు ఐవీవీ ప్రసాద్, యర్రా శేషకుమారి, మహమ్మద్ ఖాన్, అబ్దుల్లా ఆధ్వర్యంలో నగరపాలకసంస్థ సహకారంతో నిర్వహించామన్నారు. నగరపాలకసంస్థ డబ్ల్యూఎస్ఈ ఎస్ శాంతి రెడ్డి మిద్దెతోట-పెరటితోట పెంపకానికి నగరపాలకసంస్థ పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. నగరపాలకసంస్థ అధికారులు సైదా, సాంబశివరావు, గంగాధర్ పలు సూచనలు చేశారు.

చోరీ జరిగిన 24 గంటల్లో దొంగ అరెస్టు



స్వాధీనం చేసుకున్న లాప్‌టాప్, సోనీ కెమెరాతో ఎస్సై జగన్‌మోహన్‌రావు, సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: చోరీ జరిగిన 24 గంటల్లోనే దొంగను బొమ్మూరు పోలీసులు అరెస్టు చేసి, సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు జిల్లా రాళ్లచిలకసంగం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వెల్లిబోయిన వినయ్ రాజమహేంద్రవరం ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మెట్రోలాడ్జిలో దిగాడు. ఈ నెల 26వతేదీ రాత్రి సమయంలో తన లాడ్జి రూంలోని లాప్‌టాప్, సోనీ కెమెరా చోరీకి గురయ్యాయని శనివారం సాయంత్రం ఐదు గంటలకు బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిషోర్ కుమార్ పర్యవేక్షణలో బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఎండీ ఉమర్, ఎస్సై జగన్‌మోహన్, ఏఎస్సై కె.సత్యనారాయణ, పీసీ సురేష్ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడకు చెందిన పిల్లారిశెట్టి శ్రీనివాస్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.1,20,000 విలువైన లాప్‌టాప్, సోనీ కెమెరాను స్వాధీనం చేసుకున్నారు.

4 నుంచి లెజెండ్ కప్ క్రికెట్ పోటీలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు

ప్రకాశం నగర్: వయసుతో సంబంధం లేకుండా అందరూ క్రీడల్లో పాల్గొనవచ్చని జిల్లా అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు అన్నారు. ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలోని క్రికెట్ స్టేడియంలో బజాజ్ గ్లాడియేటర్స్, లెజెండ్ కప్ సీజన్ 3 టోర్నమెంట్ ఆర్గనైజర్ బాలాజీ, జయ కిషన్, ప్రభాకర్, శ్రీనివాస చౌదరి ఆధ్వర్యంలో జరిగే లెజెండ్ కప్ పోటీలకు సంబంధించిన కప్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం పోలీస్ గ్రౌండ్స్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు వీలుగా ప్రేక్షకుల గ్యాలరీని, ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పోటీల నిర్వాహకులు మాట్లాడుతూ 40 ఏళ్ల దాటిన వారిని ప్రోత్సహించాలని ఉద్దేశంతో లెజెండ్ కప్ సీజన్ - 3లో టీ 20 పోటీలు ఏర్పాటు చేశామని, ఇవి ఫిబ్రవరి 4 నుంచి 11 వరకూ జరుగుతాయన్నారు. విజయవాడ, కాకినాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం నుంచి 8 జట్లు పాల్గొంటాయన్నారు.

డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో పాన్ ఇండియా



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: నల్సా ప్రారంభించిన పాన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి ఆదివారం కేంద్ర కారాగారం, మహిళా కారాగారాన్ని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ జైళ్లలో ఉన్న చట్టంతో విభేదించబడిన బాలురు, బాలికలను గుర్తించి, న్యాయస్థానాల ముందు వారి బాల్యత్వాన్ని నిరూపించుకోవడానికి అవసరమైన చట్టపరమైన సహాయాన్ని అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం ఈనెల 25 నుంచి ఫిబ్రవరి 27 వరకు నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైనవారు న్యాయసేవాధికార సంస్థ నియమించిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్లు, కారాగార పారాలీగల్ వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకుని తగిన న్యాయ సహాయం పొందవచ్చన్నారు.

డాక్టర్ అనసూరి పద్మలతకు అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ పద్మలత

కంబాలచెరువు: మోస్ట్ ఔట్ స్టాండింగ్ లేడీగా డాక్టర్ అనసూరి పద్మలత జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ అవార్డు సాధించారు. విజయవాడలో ఆదివారం జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ అల్యూమినీ సమావేశం జరిగింది. నగరానికి చెందిన ప్రముఖ వైద్యురాలు, శ్రీలత ఆసుపత్రి అధినేత, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత అవార్డు విన్నర్‌గా నిలిచారు. కార్యక్రమంలో పాస్ట్ నేషనల్ చైర్మన్ ప్రమోద్ కుమార్, డాక్టర్ మురళీ మోహన్, అప్పాజీ, మనోహర్, బోడా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

కంబాలచెరువు: బాలికపపై పలుమార్లు అత్యాచారం చేసిన వ్యక్తిపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. దేవీచౌక్‌కు చెందిన మహిళకు ఇద్దరు కుమార్తెలున్నారు. వీరి ఇంటికి రామచంద్రపురానికి ఓ వ్యక్తి తరచూ వస్తుంటాడు. ఇద్దరి కుమార్తెల్లో ఒకరి (సుమారు 16 ఏళ్లు)పై నాలుగు నెలలుగా అత్యాచారానికి పాల్పడుతున్నాడు. ఇతడు ఆ బాలికకు తండ్రి వరస అవుతాడు. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మధురపూడి/ రాజానగరం: ముస్లింల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. రాజానగరం మండలం హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం ముస్లిం, మైనార్టీల ధార్మిక బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో అర్హత గల ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాన్ని ఇస్తానన్నారు. అలాగే ఈద్గా ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపడతానన్నారు. కాలనీలో రూ.15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించినట్టు తెలిపారు. నెల రోజుల్లో స్పిన్నింగ్ మిల్లు పార్కును అభివృద్ధి చేస్తానన్నారు. అన్ని మతాల సారాంశం అందరికీ మంచి చేయడమే అన్నారు. రంజాన్ మాసం మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోను పవిత్ర గ్రంథంలా చూశారన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



గొర్లి నాయుడు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం బొమ్మూరులో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా కొత్త గాజువాకకు చెందిన గొర్లి నాయుడు (26) రాజమహేంద్రవరంలో తన అక్కా బావల వద్ద ఉంటూ స్థానికంగా ఒక హోటల్లో పని చేస్తున్నాడు. హోటల్ సిబ్బంది ఆదివారం కేశవరంలో వేటపోతు వేసుకుని భోజనాలు పెట్టుకున్నారు. ఆ భోజనాలకు మోటారు సైకిల్‌పై గొర్లి నాయుడు కేశవరం బయలుదేరాడు. బొమ్మూరు గ్రామంలోని రాజవోలు రోడ్డులో అంబేడ్కర్ విగ్రహం సమీపంలోకి వచ్చేసరికి అతడిని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో గొర్లి నాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన జరిగిన వెంటనే లారీని వదిలేసి డ్రైవర్ పరారయ్యారు. బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఎండీ ఉమర్, ఎస్సై జుబేర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి వెంకటరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నసమారాధన

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామదేవత దోసాలమ్మ ఆలయంలో సంక్రాంతి మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు. ఉదయం నుంచి దోసాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సందడే సందడి



హ్యాపీ స్ట్రీట్‌లో డ్యాన్స్ చేస్తున్న యువత

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ వీధిని అనుకుని ఉన్న పరమహంస యోగానంద మార్గ్‌లో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న హ్యాపీ స్ట్రీట్‌కు ప్రజలు పోటెత్తుతున్నారు. చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు సందడి చేస్తున్నారు. చిన్నారులకు వివిధ రకాల ఆటలతో పాటు చదరంగం, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్ ఏర్పాటు చేశారు. హ్యాపీ స్ట్రీట్ స్టేజ్‌పై చిన్నారులు, యువత నృత్యం చేశారు.

సత్యదేవ నర్సరీ సందర్శన



సత్యదేవ నర్సరీలో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

కడియం: కడియపులంకలోని పుల్లా వీరవెంకట్రావుకు చెందిన శ్రీసత్యదేవ నర్సరీని ఆదివారం ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి సందర్శించారు. ఆయనకు నర్సరీ రైతు వీరవెంకట్రావు ఘన స్వాగతం పలికి వివిధ రకాల మొక్కల గురించి వివరించారు. అరుదైన మొక్కలను తమ నైపుణ్యంతో అభివృద్ధి చేస్తున్న కడియం ప్రాంత నర్సరీ రైతుల కృషిని నాగేశ్వర్‌రెడ్డి అభినందించారు.

నూరుశాతం సభ్యత్వంపై దృష్టి సారించాలి

కంబాలచెరువు: నూరు శాతం సభ్యత్వంపై జిల్లా కమిటీలు దృష్టి సారించాలని ఏపీ కత్వ కోస్తా జిల్లాల సదస్సులో రాష్ట్ర అధ్యక్షులు ఫణీంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏపీ కత్వ) కోస్తాలోని 16 జిల్లాల కార్యవర్గాల సమీక్షా సమావేశం ఆదివారం స్థానిక ధర్మంచర కమ్యూనిటీ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు సంబంధించిన 25 వేల మంది ఉపాధ్యాయులను ఫిబ్రవరి చివరి నాటికి ఏపీ కత్వలో సభ్యత్వం చేసుకునేలా జిల్లా, నియోజక వర్గాల కమిటీలు కృషి చేయాలన్నారు. ఏప్రిల్‌లో తాత్కాలిక కార్యవర్గాల స్థానంలో పూర్తి స్థాయి కార్యవర్గాలు ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కోలా సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు గోపిశెట్టి బంగార్రాజు, ప్రధాన కార్యదర్శి మద్దాల అప్పారావు, ఆర్థిక కార్యదర్శి కనకాల శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు చేబ్రోలు వెంకటచలం, ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు కేవీ.రమణారావు, మంగిన రామారావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న శశి విద్యాసంస్థల చైర్మన్ రవికుమార్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం శశి విద్యాసంస్థలు, భారత ప్రభుత్వ అటానమస్ బాడీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలభారత్ మహోత్సవ్ ×టీన్ టాలెంట్ ఫెస్టివల్×లో భాగంగా విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వాటిలో విజేతలతో పాటు పాల్గొన్న వారందరికీ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్, వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీసుప్రియ, జీఎం నేషనల్ స్మాల్ ఇండస్ట్రీ కార్పొరేషన్ ఎన్‌కే.సుబ్రమణి, మాజీ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శ్రీధరన్, నేషనల్ మ్యూజియం ఆఫ్ ఇండియన్ సినిమా మేనేజర్ జయితాఘోష్, రెడిఫైన్ హెచ్‌ఆర్ కన్సల్టెన్సీ సీఈవో డాక్టర్ జాఫర్ అలీ, సైకాలజిస్ట్ పీకేకే కౌశిక్, శశి అకడమిక్ డైరెక్టర్ డా.మన్నెం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.